తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# ప్రభుత్వ ఆసుపత్రి ఇలా ఉంటే ఎలా..!

**దక్కిలి ఆసుపత్రిని కలెక్టరు ఆకస్మిక తనిఖీ**

**వైద్యులు,సిబ్బంది పనితీరుపై ఆగ్రహం**



దక్కిలి,అక్టోబర్ 22, ప్రభాతవార్త;

దక్కిలి ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు,సిబ్బంది పని తీరుపై తిరుపతి జిల్లా కలెక్టరు డాక్టరు వెంకటేశ్వర్ ఆగ్రహం తెలిపారు. స్తానిక ప్రభుత్వ ఆసుపత్రిని బుదవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్నీ వైద్యసేవలు అందించే గదులు,రోగులు ఉండే వార్డులు, కాన్పులు గదులు క్షుణంగా పరిశీలించారు. అంతేగాక మండలంలో బాలింతలు, వారి వివరాలు నమోదు అయిన రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది ద్వారా ఫోను చేయించి ఎక్కడ ఉన్నారు... ఎలా ఉన్నారు...క్షేమంగా కాన్పులు జరిగాయా అని ఆరా తీసారు.తనిఖీ సమయంలో ఆయన తీవ్రంగా సిబ్బంది,వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలా అయితే పేదలకు ఎలా వైద్య సేవలు అందిస్తారని ప్రశ్నించారు.కాన్పులు రూము ఆయన తనిఖీ చేశారు.వసతులు ఉన్నా ఎందుకు కాన్పులు చేయడం లేదని ప్రశ్నించారు.కాన్పులు చేసే గది ఇలాగానే ఉండాల్సింది..కనీసం గదిని కూడా శుభ్రంగా ఉంచాలన్న ఆలోచన లేకుండా విధులు నిర్వహిస్తున్నారా..ఇందులో ఉన్న పరికరాలను ఎందుకు వినియోగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉన్న వసతులు ఉపయోగించుకుని మండలంలోని గర్భవతులకు కాన్పులు చేస్తే ఎక్కడో ప్రవేటు ఆసుపత్రులకు పేదలు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందని చెప్పారు.ఆసుపత్రికి నిర్వహణకు నిధులు వస్తున్నాయా కదా...వాటిని సద్వినియోగం చేసుకుని ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి చెప్పారు. ఆసుపత్రి పరిధిలో ఎంత మంది ఆశావర్కర్లు పని చేస్తున్నారా..ఇంత మంది ఆశావర్కర్లు ఉంటే గ్రామ స్థాయిలో వైద్యం పనితీరు ఎందుకు మెరుగు పడడం లేదని వైద్యులను ప్రశ్నించారు.ఆశావర్కర్లు ద్వారా బాలింతులు,గర్భవతులు యోగక్షమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి ఆరోగ్య భద్రతలు తీసుకోవాల్సిన బాద్యతలు దక్కిలి ఆసుపత్రి వైద్యులు చూసుకోవాలన్నారు.కాగా అంతకు ముందు బీపీ మిషన్‌ను పరిశీలించారు. ఇక ఆసుపత్రికి వచ్చే మందులు పరిశీలించి సిబ్బంది మందులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. దక్కిలి వైద్యులు పనితీరు మార్చుకోవాలి. దక్కిలి ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు పని తీరు పూర్తిగా మార్చుకోవాలని జిల్లా కలెక్టరు తెలియజేశారు.ఈ ఆసుపత్రిని పూర్తిగా పరిశీలించిన ఆనంతరం ఆయన మాట్లాడుతూ దక్కిలిలో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు మెమోలు జారీ చేయాలని జిల్లా కలెక్టరు సీసీకి తెలిపారు. అదే సమయంలో వైద్యులకు మెమోలతో ప్రస్తుతం సరిపెడుతున్నామని,ఇలాగే పనితీరు ఉంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దక్కిలి ఆసుపత్రిలో తన భార్యను కాన్పు కోసం తీసుకోస్తే ఇక్కడి వైద్యులు నిర్లక్ష్యం కారణంగా చనిపోయిందని, అప్పట్లో విచారణ కమిటీని ఏర్పాటు చేసినా ఇక్కడి వైద్యులు కమిటీని తప్పుదోవ పట్టించి తనకు అన్యాయం చేసిందని జిల్లా కలెక్టరుకు దక్కిలికి చెంది శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.ఇక్కడి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లె తన భార్య మృతి చెందిదని వివరించారు. ఆయన వెంట దక్కిలి తహాశీల్దారు మోపూరు శ్రీనివాసులు ఉన్నారు.

# అంగన్‌వాడి కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు: కలెక్టర్



వెంకటగిరి, అక్టోబర్ 23, ప్రభాతవార్త

అంగన్వాడి కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని మల్లమ్మ గుడి వీధి, చెవిరెడ్డిపల్లిలోని అంగనవాడి కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లోని రికార్డులను స్టాక్‌ను పరిశీలించారు. సిడిపిఓ షంషాద్ బేగం, సిబ్బంది ఉన్నారు.

# 'గజరాజ' దాడులతో మృత్యుభయం

**-కుప్పం ప్రాంతంలో నాలుగు నెలల్లోనే ఇద్దరు రైతుల దుర్మరణం.!!**

**- తమిళ మదపు టేనుగు దాడులతో రైతులు భయాందోళనలు !!**

కుప్పం, అక్టోబర్ 23 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో తమిళనాడు నుంచి వచ్చిన మదపుటేనుగు అటు రైతులు, ఇటు ప్రజలకు కంటిపై కునుకులేకుండా చేస్తోంది.గత నాలుగు నెలల కాలంలో కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలంలో ఇద్దరు రైతులు వేర్వేరు మదపుటేనుగుల దాడుల్లో మృత్యువాత పడ్డారు. ఈ రెండు ఏనుగులు కుప్పం అటవీ ప్రాంతం నుంచి రామకుప్పం అటవీ ప్రాంతానికి చేరి రైతులను హతమార్చాయి. కుప్పం ప్రాంతం కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాలనుంచి ఏనుగులు ఈ ప్రాంతంలోకి సులువుగా ప్రవేశిస్తున్నాయి. 2014-19 మధ్య కాలంలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అప్పటి అటవీ అధికారులు నియోజకవర్గంలో సుమారు 143కిలోమీటర్ల అటవీ ప్రాంతం చుట్టూ కందకాలు (ట్రెంచ్)లు, సోలార్ కంచెలు ఏర్పాటుచేశారు. అయితే రానురాను ట్రెంచ్‌ల నిర్వహణ లేకపోవడంతో అవి పలు ప్రాంతాల్లో పూడిపోయాయి. సోలార్ కంచె బ్యాటరీలు పనిచేయకపోవడంతో అటు కందకాలు, ఇటు సోలార్ కంచెలు వృధాగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో కుప్పం ప్రాంతంలోకి ఏనుగుల రాకపోకలు సాధారణంగా మారాయి. గత వైఎస్సార్సీ పాలనలో రామకుప్పం మండలం ననియాల తాండా, గుడుపల్లె మండలం సంగనపల్లి ప్రాంతాల్లో 5కి.మీ.ల మేర మాత్రమే సోలార్ కంచెలను పునరుద్ధరించారు. అయితే పూర్తిస్థాయిలో ట్రెంచ్‌లు, సోలార్ కంచెలు ఏర్పాటుచేయకపోవడంతో ఏనుగుల దాడుల్లో రైతులు పంటలు కోల్పోవడంతో పాటు దురదృష్టవశాత్తు ప్రాణాలు సైతం కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

### రూపం కోల్పోతున్న అటవీ ప్రాంతం

కుప్పం, పలమనేరు నియోజకవర్గాలకు సంబంధించి కౌండిన్య రాయల్ ఎలిఫెంట్ రిజర్వ్‌గా పిలవబడే అటవీ ప్రాంతం రూపం కోల్పోతోంది. దట్టమైన అటవీ ప్రాంతం కలప, ఇసుక స్మగ్లర్ల దెబ్బకు విస్తీర్ణం తగ్గిపోయింది. అటవీ ప్రాంతంలో ఇసుక రవాణాకు యధేచ్ఛగా రోడ్లు వేయడం, అటవీ భూములను పలుచోట్ల ఆక్రమించడం వంటి చర్యలతో అటవీ భూభాగం కుప్పం నియోజకవర్గంలో తగ్గుతూ వస్తోందని పర్యావరణ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో అడవులకు పరిమితం కావాల్సిన వన్యప్రాణులు జనారణ్యాల్లో వచ్చి పంటలు, మనుషులపై దాడులకు దిగుతున్నాయి.







నాలుగు నెలల్లో చనిపోయిన ఇద్దరు రైతులు కన్ననాయక్, రెడ్యానాయక్
రైతును హతమార్చిన మదపుటేనుగు ఫైల్‌ఫోటో

### 2020నుంచి పెరుగుతున్న దాడులు ..

ఏడు మరణాలు : 2010సం॥నుంచి కుప్పం ప్రాంతానికి ఏనుగుల రాకపోకలు అధిక మయ్యాయి. అయితే తదనంతరం ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టడంతో ఏనుగుల రాకపోకలు జరిగినా కేవలం పంటలపై దాడులు చేసేవి. అయితే 2020ను ంచి కుప్పం నియోజకవర్గంలో ఏనుగుల దాడులు పెరుగుతున్నాయి. అందుకు కారణం పూడిపోయిన కందకాలు, పనిచేయని సోలార్ కంచెలు. ఏనుగులు పంటలపై దాడులు చేయడంతో పాటు ప్రజలు, రైతులను హతమార్చడం చోటు చేసుకుంది. 2020లో కుప్పం, శాంతిపురం మండలాల్లో ఓ యువతి, ఓ మహిళ ఏనుగు దాడిలో మృతి చెందారు.2022లో గుడుపల్లె మండలంలో ఓ రైతు, 2023లో కుప్పం మండలం పర్తిచేను, సప్పానికుంటలో ఇద్దరు మహిళలు ఏనుగుల దాడిలో మృత్యువాత పడ్డారు. గతేడాది డిసెంబర్‌లో ఓ రైతుపై ఏనుగు దాడి చేసినా అతను మృత్యువునుంచి తప్పించుకున్నాడు. కాగా ఈఏడాది జూన్ నెలలో రామకుప్పం మండలం పిఎంకె తాండాకు చెందిన కన్నానాయక్ (72)ను సైతం ఒంటరి ఏనుగు హతమార్చింది. తాజాగా అదే గ్రామానికి చెందిన రెడ్యానాయక్ (47)సైతం మదపుటేనుగు చంపేసింది. ఉన్నతాధికారులు స్పందించి కుప్పం నియోజకవర్గంలో గజరాజుల కట్టడికి పటిష్టమైన కందకాలు, సోలార్ కంచెలను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మెడకు అక్రమాల ఉచ్చు

**నేటి నుండి 3 రోజుల పాటు**

**గుంటూరు జిల్లా డిఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో విచారణ**

చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టిన అక్రమ నియమకాలు, ఇతర దందాలు ఇది వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వర్తించిన డాక్టర్ శ్రీహరి మెడకు అక్రమల ఉచ్చు బిగుసుకోవడానికి రంగం సిద్ధమైంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ శ్రీహరి విధులు నిర్వర్తించిన సమయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జరిగిన అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వానికి రోజువారి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ అక్రమాలపై సమగ్రంగా విచారించడానికి ప్రభుత్వం గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డాక్టర్ శ్రీహరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వర్తించిన సమయంలో జరిగిన అక్రమాలపై మూడు రోజుల పాటు చిత్తూరులో మకాం వేసి విచారించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిద్ధం అయ్యారు. ఈ మేరకు విచారణకు ఎవరెవరు హాజరు కావాలనే విషయంపై విచారణ అధికారి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ శ్రీహరి విధులు నిర్వర్తిస్తున్న సమయంలో భారీ అక్రమాలకు పాల్పడ్డారని అప్పట్లోనే ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో అధికార పార్టీ నాయకుల అండ చూసుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శాఖ పరిధిలో జరిగిన పలు పోస్టింగ్‌ల వ్యవహారంలో సైతం ఏకపక్షంగా వ్యవహరించి అర్హులైన అభ్యర్థులకు అన్యాయం చేశారని ఇప్పటికీ ఆరోపణలు వున్నాయి. ఎలాంటి మెరిట్ జాబితా, రోస్టర్ లేకుండా అనర్హులైన వారికి భారీ ముడుపులు తీసుకుని పోస్టింగ్స్ ఇచ్చారని ఆరోపణలు వున్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం విచారణకు ఎవరెవరు హాజరై విచారణ అధికారి ఎదుట ఏమి చెప్తారనే విషయం ప్రస్తుతం ఆసక్తిగా మారింది.

# ప్రతి సమస్య పరిష్కరించడానికి చర్యలు

**- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**

చిత్తూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన ప్రతి అర్జీని అర్థవంతంగా పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుండి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందే సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ముఖ్యమంత్రి కార్యాలయ గ్రీవెన్స్, రీ-ఓపెన్ కేసులకు సంబంధించి అర్జీలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తోందన్నారు. దీనికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమస్యల పరిష్కారంలో అర్జీదారుడికి అర్థవంతమైన, నాణ్యమైన ఎండార్స్‌మెంట్ ఇస్తూ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించే అంశంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 2024 జూన్ 15 నడుండి ఇప్పటి వరకు 8,996 ఫిర్యాదులు అందగా నిర్ణీత సమయంలో 6,399 సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, డ్వామా పిడి రవికుమార్, హౌసింగ్ పిడి పద్మనాభం, సిపిఓ సాంబశివారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అదికారి మురళీకృష్ణ, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, మెప్మా పిడి రాధామ్మ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేటు రుణ సంస్థల వేధింపులు

**అధికార తెలుగుదేశం పార్టీ ఎంపిటిసీ నూజివీడులో హత్య**

**గుండెపోటుతో మృతి చెందాడని చెప్తున్న ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులు**

**ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులే హత్య చేశారని ఎంపిటిసీ కుటుంబసభ్యులు ఆరోపణ**



హత్యకు గురైన తెలుగుదేశం ఎంపిటిసీ గన్నాధరాజు(ఫైల్‌ఫోటో)

పాలసముద్రం, అక్టోబర్ 23 ప్రభాతవార్త:

ప్రైవేటు రుణ సంస్థల వేధింపులకు మండలానికి చెందిన అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపిటిసీ జగన్నాధరాజు మృతి చెందాడు. నూజివీడులో జగన్నాధరాజు మృతి చెందడంతో ఫైనాన్స్ నిర్వాహకులు ఈ హత్య చేశారని కుటుంబసభ్యులు ఆరోపిస్తుండగా గుండెపోటు వచ్చి ఇక్కడ మృతి చెందాడని ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులు చెప్తున్నారు. ఎంపిటిసీ జగన్నాధరాజు భవన నిర్మాణ పనులు కాంట్రాక్ట్ పద్దతిలో చేపట్టేవాడు. ఈ క్రమంలో ఇతను ట్రాక్టర్లు, జెసిబి, ఇతర యంత్రాలు క్రయ విక్రయాలు చేసేవాడు. ఈ క్రమంలో ఇటీవల జగన్నాధరాజు నూజివీడులోని ఓ ప్రైవేటు సంస్థ నుండి ఒక జెసిబిని కొనుగోలు చేశాడు. ఈ జెసిబికి సంబంధించి రుణం కంతుల వారీగా చెల్లించడంలో జగన్నాధరాజు విఫలం కావడంతో ఆ ఫైనాన్స్ సంస్థకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో పాలసముద్రంకు వచ్చి జగన్నాధరాజు గురించి ఆరా తీశారు. జగన్నాధరాజు చిత్తూరులో వున్నట్లు తెలుసుకున్న ఆ సంస్థ వ్యక్తులు జిడినెల్లూరు మండలం అంభోధరపల్లి సమీపంలో ద్విచక్రవాహనంలో వస్తున్న జగన్నాధరాజును నిలిపారు. ఆపై ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం జరుగడంతో జగన్నాధరాజును ఆ సంస్థ నిర్వాహకులు కిడ్నాప్ చేసి నూజివీడుకు తీసుకెళ్ళారు. ఈ విషయంను సైతం ఫైనాన్స్ నిర్వాహకులు జగన్నాధరాజు కుటుంబ సభ్యులకు వివరించారు. ఆపై జగన్నాధరాజు నూజివీడుకు వెళ్తున్న సమయంలోనే సోమవారం అర్ధరాత్రి గుండెపోటు వచ్చి కారులోనే మృతి చెందాడని ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు జగన్నాధరాజు కుటుంబసభ్యులకు చెప్పారు. ఈ క్రమంలో జిడినెల్లూరు పోలీసులు కిడ్నాప్ చేసి హత్యకు గురైన జగన్నాధరాజు కేసులో వీరేష్, శివ, మణి, చంద్ర, నాగరాజు తదితరులపై కేసు నమోదు చేశారు. జిడినెల్లూరు పోలీసులతో పాటు జగన్నాధరాజు కుటుంబసభ్యులు నూజివీడుకు వెళ్ళి అతని మృతదేహంను తీసుకువచ్చారు. దీనిపై ఏం జరుగుతుందో తెలియాల్సివుంది.

**చిల్లకూరు వడ్డిపాలెంలో**

# వ్యక్తి అనుమానాస్పద మృతి

**- మృతదేహంతో హైవేపై బైఠాయించిన గ్రామస్థులు**





చెంచయ్య మృతదేహంతో బైఠాయించిన గ్రామస్థులు

పెళ్లకూరు, అక్టోబర్ 23 ప్రభాతవార్త

పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బుధవారం స్వర్ణముఖి నది పక్కన చెంచయ్య (50) మృతదేహం అనుమానాస్పదంగా పడి ఉండటాన్ని పశువుల కాపరి గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చెంచయ్య మృతిచెందడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని జాతీయ రహదారిపైకి తీసుకొచ్చి బైఠాయించారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డిసిసిబి మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకొని గ్రామస్థులకు మద్దతు పలికారు. పికెట్ కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసుల వైఫల్యంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని ఆగ్రహించారు. సంఘటన స్థలానికి డిఎస్పీ చెంచుబాబు, సిఐలు సంగమేశ్వరరావు, బాబి, ఎస్ఐ నాగరాజు, పోలీసు సిబ్బంది చేరుకున్నారు. నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు గ్రామస్థులతో మాట్లాడారు. వారు వినకపోవడంతో కాసేపటి తర్వాత అక్కడి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలావుంటే మృతదేహంపై పలుచోట్ల కాలిన గాయాలు ఉండటం అనుమానాస్పదంగా మారింది. పోలీసు పికెట్ నేపథ్యంలో పోలీసులు గ్రామంలో పలువురిని బెదిరించారని గ్రామస్థులు చెప్తుండటం గమనార్హం.

# శ్రీకాళహస్తీశ్వరాలయ కొత్త ఇఓగా బాబిరెడ్డి?

**రెండు మూడురోజుల్లో అధికారిక ఉత్తర్వులు**

శ్రీకాళహస్తి,అక్టోబర్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా నెల్లూరు కార్పొరేషన్ వైస్‌చైర్మెన్‌గా (నుడా) బాబిరెడ్డిని నియమించినట్లు సమాచారం . రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేయనున్నట్లు సమాచారం. నెలకు పైగా ఇక్కడి ఆలయానికి తిరుపతి ఆర్‌జెసిగా పని చేసిన ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఇఓగా పని చేసారు.ఇక్కడ పని చేస్తున్న తిరుపతి ఆర్‌జెసి ఎన్‌వియస్‌యన్ మూర్తి ఫుల్ అడిషనల్ చార్జి ఇఓగా సుమారు 3 నెలలు పని చేసారు. రెగ్యూలర్ ఇఓను నియమించాలని స్థానిక నాయకుడు శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దేవాదాయశాఖ మంత్రి ఆనం



రామ్‌నారాయణరెడ్డిని కోరగా ఆయన నుడా వైస్ చైర్మెన్‌గా పని చేసిన బాబిరెడ్డి పేరును సూచించారు. సుమారు రెండు నెలలుగా ఈ నియామకం ఊగిసలాడింది. చివరకు ఖరారు దిశగా వచ్చినట్లు సమాచారం.

### ఎక్కువ కాలం నెల్లూరులోనే . . .

ఉత్తరాంధ్రాకు చెందిన బాబిరెడ్డి తన సర్వీసు ఎక్కుక కాలం నెల్లూరుజిల్లాలోనే పని చేసారని తెలిసింది.గూడురు ఆర్‌డిఓగా పని చేసిన ఆయన సుమారు ఐదేళ్ళుకు పైగా నెల్లూరుజిల్లాలోనే పని చేస్తున్నట్లు సమాచారం. నెల్లూరు జెసి 2గా పని చేసిన ఆయన కొంత కాలం మాజీ ఇరిగేషన్ శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ వద్ద ఓయస్‌డిగా పని చేసారు. తరువాత నుడా వైస్ చైర్మెన్‌గా పని చేసారు. శ్రీకాళహస్తి ఆలయానికి రెగ్యూలర్ ఇఓ కావాలని అంతేకాక ఇక్కడ మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేయాలని, శాసనసభ్యుడు ఆలోచనలకు తగ్గట్టు పని చేసే అధికారి కోసం పరిశీలించి ఏ పని అయినా సునాయాసంగా చేయగల అధికారిగా నెల్లూరుజిల్లాలో పేరున్న బాబిరెడ్డిని నియమించాలని దేవాదాయశాఖ మంత్రిని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కోరినట్లు తెలిసింది.

# ఇసుక ట్రాక్టర్ ఢీకొని తండ్రి, కుమారుడి మృతి

**భార్యకు తీవ్రగాయాలు**





తొట్టంబేడు, అక్టోబర్ 23 ప్రభాతవార్త

మండలంలోని చియ్యవరం గ్రామానికి చెందిన ఓతండ్రి, చిన్నారి కొడుకు మృతిచెందిన సంఘటన తీవ్రంగా కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి. చియ్యవరం గ్రామానికి చెందిన కంచిరాజేంద్ర(35), కుమారుడు కంచి చైతన్య(5) భార్య గురవమ్మ (26)లతో కలసి ద్విచక్రవాహనంపై శ్రీకాళహస్తి నుంచి చియ్యవరం గ్రామానికి వెళ్తుండగా దొమ్మరపాళెం సమీపంలో వస్తున్న ఇసుక ట్రాక్టర్ డీకొనడంతో వాహనంలో ప్రయాణిస్తున్న రాజేంద్ర, కుమారుడు చిన్నారి చైతన్యలు అక్కడికక్కడే మృతిచెందగా భార్య గురవమ్మ తీవ్రంగా గాయపడడంతో పట్టణంలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. మృతి చెందిన వారి బంధులు రోధన ఏరియా ఆస్పత్రిలో వర్ణనాతీతంగా మారింది. ఈకష్టం ఎవ్వరికి రాకూడదని పలువురు ప్రజలు రోధిస్తున్నారు. మృతునికి నలుగురు పిల్లలు వారిలో ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### ఆగని ఇసుక మాఫియా..

మండలంలో ఇసుక మాఫియా, మట్టిమాఫియా జోరుగా సాగుతున్నా అధికారులు, పోలీసులు, ఎంఎల్ఏ ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. ప్రస్తుతం జరిగిన ప్రమాదానికి ఎవరు కారకులు వారి కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారో ప్రజాప్రతినిధులే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రమాద విషయం తెలియగానే మండల వైకాపా కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయుడు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్‌లు అక్కడకు చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. అయితే పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మామూళ్ళ మత్తులో ఉన్నందుకే ఇసుక ట్రాక్టర్లకు అనుతిస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. ఎంఎల్ఏ ఎంత చెప్పినా పట్టించుకోవకపోవడంత ఇలాంటి అనర్ధాలకు దారితీస్తోంది. ఇకనైనా ఇసుక అక్రమ మాఫియాకు చెక్‌పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

**అక్కడికక్కడే ఒకరు మృతి, మరో వ్యక్తికి తీవ్రగాయాలు**

తిరుచానూరు, అక్టోబర్ 23, ప్రభాతవార్త

ఎన్‌హెచ్ 150 జాతీయరహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరు సమీపాన ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు చంద్రగిరి నుండి రేణిగుంట వైపు ప్రయాణిస్తున్న లారీ తిరుచానూరు సమీపాన మామిడికాయ మండి నుండి తనపల్లి వైపుకు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనంను రహదారి కూడలి వద్ద రోడ్డును దాటుతుండగా ఢీకొంది. ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయాలు పాలైన వ్యక్తిని ఆంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారు. వారి గ్రామంలో సమీప నివాసితుల సమాచారం మేరకు మృతుడు పేరమంజు, తిరుపతి గ్రామీణ మండలం తనపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహాల వద్ద నివసిస్తున్నారు. అతని వయసు సుమారు 28 సంవత్సరాలు, మరో వ్యక్తి పేరు మణి ఇరువురు తాపి మేస్త్రీగా జీవనం సాగించేవారు. మృతుడి అన్న నూతనంగా ప్రారంభించిన కిరాణా అంగడికి సిగరెట్లను హోల్ సెల్ నందు కొనుగోలు చేసి తిరుగు ప్రయాణంలో ప్రమాదం సంభవించింది. సంఘటనా స్థలంకు చేరుకున్న తండ్రి ఆవేదనను చూసి స్థానికులు కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఎంఆర్‌పల్లి సిఐ ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలు పాలైన మణిని ఆంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



